మెయిన్

# టీ-మీడియా

సామాజికం.. ప్రజల పక్షం...

సంపుటి : 8
సంచిక : 190
పేజీలు : 3

శనివారం
07.02.2026

GSTIN:36FDKPS1308P1ZX | Digital, tmedia.net.in

ఎడిటర్ : శనగపాటి మురళీకృష్ణ


## నేడు ఉబర్, ఓలా, ర్యాపిడో బంద్

**టిమీడియా, ఫిబ్రవరి 6 , న్యూఢిల్లీ :**




మరోకొన్ని గంటల్లో దేశవ్యాప్తంగా ఓలా, ఉబర్, ర్యాపిడో సేవలు నిలిచిపోనున్నాయి. యాప్ ఆధారిత రైడ్ హెయిలింగ్ సేవల డ్రైవర్లు(గిగ్? వర్కర్లు) శనివారం ఫిబ్రవరి 7న దేశవ్యాప్తంగా సమ్మెకు పిలుపునిచ్చారు. ఈ సమ్మె ప్రభావంతో మెట్రో నగరాలే కాకుండా చిన్న పట్టణాలు, గ్రామీణ ప్రాంతాల్లో కూడా ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొనే అవకాశం ఉంది.కనీస బేస్ ఛార్జీలు నిర్ణయించడం, న్యాయమైన ఛార్జ్ విధానం అమలు చేయడం వంటి డిమాండ్లతో గిగ్ వర్కర్లు చాలా కాలంగా పోరాటం చేస్తున్నారు. ఛార్జీల విషయంలో తీవ్ర అసంతృప్తి, ప్రభుత్వ నిర్లక్ష్య వైఖరి, నియంత్రణ లేని పనివేళలు, ఎలాంటి సామాజిక భద్రత లేకపోవడం, ఆర్థిక భద్రత పూర్తిగా కొరవడటం వంటి సమస్యలతో డ్రైవర్లు సమ్మె బాట పట్టారు.డ్రైవర్లు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లడమే ఈ నిరసనల ప్రధాన లక్ష్యమని తెలంగాణ గిగ్ అండ్ ప్లాట్‌ఫామ్ వర్కర్స్ యూనియన్ నేతలు తెలిపారు. ఈ సమ్మెను ఇతర జాతీయ కార్మిక సంఘాల సహకారంతో నిర్వహిస్తోంది.దేశవ్యాప్తంగా గిగ్ వర్కర్లు 'ఆల్ ఇండియా బ్రేక్‌డౌన్' పాటించనున్నట్లు యూనియన్ ప్రకటించింది. ఒకవైపు అగ్రిగేటర్ సంస్థలు భారీ లాభాలు పొందుతుండగా, మరోవైపు డ్రైవర్లు పేదరికంలోకి జారిపోతున్నారని తమ డిమాండ్లను వెంటనే పరిష్కరించాలని కోరుతూ ఇప్పటికే కేంద్ర రోడ్డు రవాణా మరియు హైవేల శాఖ మంత్రి నితిన్ గడ్కరీకి లేఖ రాసినట్లునేతలు వెల్లడించారు. ప్రభుత్వం స్పందించకపోతే పోరాటాన్ని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

# కేసీఆర్, కేటీఆర్‌లను అరెస్టు చేస్తారనే... సీబీఐకి అప్పగించాం



## 10 ఏళ్ల లో నిజామాబాద్ మురికి కూపం

### సీఎం రేవంత్ రెడ్డి

**టిమీడియా, ఫిబ్రవరి 6 , నిజామాబాద్ :**

లక్ష కోట్లతో నిర్మించిన కాళేశ్వరం ప్రాజెక్టులో అవినీతి జరిగిందని బీజేపీ చెప్పిందని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. కేటీఆర్, కేసీఆర్‌ను అరెస్టు చేస్తారని కాళేశ్వరం కేసును సీబీఐకి అప్పగిస్తే ఇంతవరకు అతి లేదు గతి లేదని మండిపడ్డారు. కేసీఆర్, కేటీఆర్‌లను కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి కాపాడుతున్నారని ఆయన ఆరోపించారు. అసలు కిషన్‌రెడ్డి ఎందుకు కాపాడుతున్నారు? అని ప్రశ్నించిన సీఎం కిషన్‌రెడ్డి కల్వకుంట్ల కిషన్‌రావుగా మారారని ధ్వజమెత్తారు. ఎప్పుడో కాంగ్రెస్ నిర్మించిన ప్రాజెక్టులు ఎలా ఉన్నాయి, మీరు కట్టిన ప్రాజెక్టులు ఎలా ఉన్నాయి? అని ప్రతిపక్షంపై ప్రశ్నలు సంధించారు. నిజామాబాద్ జిల్లా బర్దిపూర్‌లో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసిన అనంతరంఏర్పాటుచేసిన బహిరంగసభలో పాల్గొని ప్రసంగించారు. ఫిబ్రవరి11న జరగబోయే మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ జెండా ఎగరవేయబోతున్నామని సీఎం రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. నిజామాబాద్ జిల్లా తెలంగాణకు గొప్ప నాయకులను అందించిందని, మున్సిపల్ ఎన్నకల్లో విలక్షణమైన తీర్పు ఇవ్వాలని జిల్లా ప్రజానికాన్ని కోరారు. 10 ఏళ్ల బీఆర్ఎస్ పాలనలో నిజామాబాద్ మురికి కూపంగా మారిందన్న ఆయన కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం కూడా ఇందూరుకు ఏం చేయలేదన్నారు. కాళేశ్వరంపై కేంద్రప్రభుత్వం చర్యలు ఏమైయ్యాని బీజేపీని అడుగుతున్నట్లు చెప్పారు.

#### మళ్లీ అధికారంలోకి కాంగ్రెస్

నిజామాబాద్ పసుపు బంగారంతో పోటీ పడేదని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గుర్తు చేశారు. ఇక్కడి వ్యవసాయం తెలంగాణకే కాదు దేశానికే ఆదర్శం అని కొనియాడారు. నిజామాబాద్ రైతుల పోరాటం దేశానికే ఆదర్శమని ప్రశంసలు కురిపించారు. 2028 ఎన్నికల్లో కాంగ్రెస్‌ను మళ్లీ అధికారంలోకి తీసుకువస్తామని ధీమా వ్యక్తం చేశారు. నిజామాబాద్‌లోని ప్రాజెక్టుల పూర్తికి, అదనపు నిధులు ఇవ్వడానికి ప్రయత్నిస్తున్నట్లు తెలిపారు.టీపీసీస అధ్యక్షులు మహేశ్‌కుమార్ గౌడ్ సూచనలతో నిజామాబాద్‌లో అభివృద్ధి పనులు చేస్తున్నామని సీఎం తెలిపారు. నిధులు విడుదల చేసి మున్సిపాల్టీలను అభివృద్ధి చేయాలనుకున్నా, 90 శాతం మున్సిపాల్టీల్లో బీఆర్ఎస్ సభ్యులే ఉన్నారని అన్నారు. ఒకవేళ నిధులు ఇచ్చినా అభివృద్ధి చేస్తారనే నమ్మకం లేదని, కాంగ్రెస్ అభ్యర్థులను గెలిపించుకుంటేనే మున్సిపాల్టీల్లో వేగంగా అభివృద్ధి జరుగుతుందన్నారు.

#### నిజామాబాద్‌కు ఏం తెచ్చారు

బీజేపీలో నిజామాబాద్ ఎంపీ ధర్మపురి అర్వింద్‌కు పరపతి లేదని సీఎం రేవంత్‌రెడ్డి ఆరోపించారు. నిజామాబాద్‌ను ఎందుకు స్మార్ట్ సిటీగా ప్రకటించలేదు? అని ప్రశ్నించారు. బీజేపీ నేతలు తెలంగాణకు కేంద్రం నుంచి నిధులు తీసుకురావడం లేదని ఆక్షేపించారు. నిజామాబాద్‌కు ఏం తెచ్చారని ధర్మపురి అర్వింద్‌ను అడుగుతున్నట్లు చెప్పారు.తాను అందిరి వాడినని తనకు కులం, మతం లేదని సీఎం రేవంత్‌రెడ్డి బహిరంగ సభలో అన్నారు. అన్ని మతాలను, కులాలను సమన్వయం చేసి రాష్ట్రాన్ని అభివృద్ధి చేస్తున్నామని తెలిపారు. రెండుసార్లు ఎంపీగా గెలిపిస్తే నిజామాబాద్‌కు ధర్మపురి అర్వింద్ ఏం చేశారని విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏం చేసిందని బీఆర్ఎస్ వాళ్లు అంటున్నారని సీఎం రేవంత్ రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇలా స్పందిస్తూ "లక్షల మందికి రేషన్ కార్డులు ఇచ్చాం, 3.17 కోట్ల మందికి సన్నబియ్యం ఇస్తున్నాం, గ్రూప్-1 పరీక్షలు నిర్వహించి ఉద్యోగాలు ఇచ్చామని స్పష్టం చేశారు."

#### 7 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం

రెండేళ్ల కాంగ్రెస్ పాలనలో అనేక అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు చేపట్టామని నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ తెలిపారు. దేశంలోనే తొలిసారి సన్నబియ్యం పంపిణీ ప్రారంభించడం కాంగ్రెస్ పార్టీ ఘనత అని పేర్కొన్నారు. మున్సిపల్ ప్రచారంలో కార్యకర్తలు మన సంక్షేమ కార్యక్రమాలను ఇంటింటికి వెళ్లి వివరించాలని చెప్పారు. అర్హులందరికీ రేషన్ కార్డులు ఇచ్చామని, 2023 బీఆర్ఎస్ ప్రభుత్వం ఖరీఫ్‌లో 4 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగులు చేస్తే, కాంగ్రెస్ ప్రభుత్వం 7 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేసిందని అన్నారు.

## అనర్హత పిటిషన్లు..

### ఈసారి కోర్టు ధిక్కార ఉత్తర్వులే...


**టిమీడియా, ఫిబ్రవరి 6 , న్యూఢిల్లీ:**



భారత్ రాష్ట్ర సమితి నుండి భారత జాతీయ కాంగ్రెస్‌లోకి పది మంది ఎమ్మెల్యేలు ఫిరాయించిన వ్యవహారానికి సంబంధించి, మిగిలి ఉన్న అనర్హత పిటిషన్లపై మూడు వారాల్లోగా తప్పనిసరిగా నిర్ణయం తీసుకోవాలని తెలంగాణ శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్ కు సుప్రీంకోర్టు శుక్రవారం మరో ఆదేశాలు జారీ చేసింది. ఈసారి నిర్ణయం తీసుకోకపోతే కోర్టు ధిక్కార ఉత్తర్వులు జారీ చేయవలసి వస్తుందని హెచ్చరించింది. తీర్పు వెలువరించిన తర్వాత, ఈ వ్యవహారంపై రీల్స్ చేయవద్దని కోర్టు పిటిషనర్‌కు సూచించింది.జస్టిస్ సంజయ్ కరోల్, జస్టిస్ ఏజీ మసిహ్‌లతో కూడిన ధర్మాసనం పార్టీ ఫిరాయించిన ఎమ్మెల్యేల జూలై 31, 2025 నాటి ఉత్తర్వుకు సంబంధించిన సమ్మతిపై విచారణ జరుపుతోంది. ఆ ఉత్తర్వులో కాంగ్రెస్ పార్టీలోకి ఫిరాయించారని ఆరోపణలు ఎదుర్కొంటున్న 10 మంది బీఆర్ఎస్ ఎమ్మెల్యేల అనర్హత కోరుతూ దాఖలైన పిటిషన్లపై నిర్ణయం తీసుకోవడానికి స్పీకర్‌కు కోర్టు మూడు నెలల సమయం ఇచ్చింది. స్పీకర్ నిర్ణీత గడువులోగా చర్య తీసుకోవడానికి నిరాకరించడంతో, కోర్టు ధిక్కార పిటిషన్లు దాఖలయ్యాయి. కోర్టు నుండి తీవ్ర హెచ్చరిక వచ్చిన తర్వాత స్పీకర్ గత డిసెంబర్‌లో ఏడు పిటిషన్లను తిరస్కరిస్తూ వాటిపై నిర్ణయం తీసుకున్నారు. అయితే, మరో మూడు పిటిషన్లు ఇంకా పెండింగ్‌లో ఉన్నాయని సీనియర్ న్యాయవాది అభిషేక్ మను సింఘ్వీ, సీనియర్ న్యాయవాది ముకుల్ రోహత్గి (తెలంగాణ రాష్ట్రం తరపున) రెండు వారాల పాటు వాయిదా కోరారు.మూడు కేసులలో ఏదైనా పురోగతి ఉంటుందని ఆశిస్తున్నందున కోర్టు రెండు వారాల పాటు వాయిదా మంజూరు చేసింది. 8 మంది ఎమ్మెల్యేలపై స్పీకర్ తీసుకున్న నిర్ణయాన్ని తెలిపిన న్యాయవాది సింఘ్వీ మిగిలిన రెండు కేసులలో స్పీకర్ నిర్ణయం తీసుకునే దశలో ఉన్నారని తెలియజేస్తూ, మూడు వారాల సమయం కోరారు. ఆ రెండు కేసుల్లో స్పష్టమైన ఆధారాలున్నాయని బీఆర్ఎస్ న్యాయవాది మోహిత్ రావు ఆ ఎమ్మెల్యేలపై విచారించడానికి ఏమీ లేదని పేర్కొన్నారు. ఒకరు బీఆర్ఎస్ పార్టీ నుంచి గెలుపొంది కాంగ్రెస్ పార్టీ తరపున ఎంపీగా పోటీ చేశారని, అంతేకాకుండా ఇప్పుడు పార్టీ ఫిరాయింపుల కేసు కోర్టు నడుస్తున్నందున అందరూ బీఆర్ఎస్ లోనే ఉన్నట్లు చెపుతున్నారని మోహిత్ రావు కోర్టుకు తెలిపారు. ఇరుపక్షాల వాదనలు విన్న ధర్మాసనం తదుపరి తీర్పును మూడు వారాలకు వాయిదా వేసింది.

## ఏది సరైనదనిపిస్తే... అదే చేయండి

### మోదీ ప్రసంగంపై రాహుల్ సెటైర్




**టిమీడియా, ఫిబ్రవరి 6 , ఢిల్లీ బ్యూరో :** రాజ్యసభలో ప్రధాని నరేంద్ర మోదీ ప్రసంగంపై కాంగ్రెస్ అగ్ర నాయకుడు, లోక్‌సభ ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ స్పందించారు. జో ఉచిత్ సమ్జో వహీ కరో (మీరు సరైనది అనుకున్నది చేయండి) అంటూ వ్యంగ్యంగా విమర్శించారు. పార్లమెంట్? మకర్ ద్వార్ వద్ద కాంగ్రెస్ సహా ప్రతిపక్ష ఎంపీలు శుక్రవారం ఉదయం చేపట్టిన నిరసనలో పాల్గొన్న రాహుల్, ఈ మేరకు పలు వ్యాఖ్యలు చేశారు.శుక్రవారం ఉదయం పార్లమెంట్ మకర్ ద్వార్ వద్ద కాంగ్రెస్ సహా ప్రతిపక్ష ఎంపీలు ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. జో ఉచిత్ సమ్జో వహీ కరో అంటూ ప్లకార్డులు ప్రదర్శిస్తూ ఆందోళన కొనసాగించారు. భారత్?, అమెరికా డీల్?ను ట్రాప్? డీల్?గా వర్ణిస్తూ ప్లకార్డులు ప్రదర్శించారు. ఆ సమయంలో వారితోపాటు రాహుల్ గాంధీ కూడా పాల్గొని నినాదాలు చేశారు. అప్పుడే మీడియాతో మాట్లాడుతూ, జో ఉచిత్ సమ్జో వహీ కరో అంటూ విమర్శించారు.అదే సమయంలో కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే కూడా మోదీ ప్రసంగం తీవ్ర విమర్శలు గుప్పించారు. ప్రభుత్వం వాస్తవాలను దాచిపెడుతోందని, ప్రతిపక్షం లేవనెత్తిన కీలక అంశాలకు ప్రధాని సమాధానం ఇవ్వకుండా తప్పించుకున్నారని ఆరోపించారు. ప్రధాని ప్రసంగ సమయంలో ప్రతిపక్ష సభ్యులు నినాదాలు చేస్తూ వాకౌట్ చేసిన విషయం తెలిసిందే. జాతీయ భద్రత, చైనా అంశాలపై తమ ఆందోళనలకు సరైన సమాధానం రాలేదనే కారణంతో సభను బహిష్కరించామని ఖర్గే తెలిపారు.ప్రధాని ప్రసంగానికి స్పందించాల్సిన అవసరం లేదు. కానీ ఆయన చెప్పిన అసత్యాలకు సమాధానం ఇవ్వాల్సి వస్తోంది. అబద్ధాలను పదేపదే చెప్పడం ఆయన అలవాటైపోయింది" అని ఖర్గే విమర్శించారు. 97 నిమిషాల ప్రసంగంలో ప్రధాని గత 100 ఏళ్లు, 75 ఏళ్లు, 50 ఏళ్ల చరిత్ర గురించి మాత్రమే మాట్లాడారని, కానీ ప్రస్తుత సమస్యలపై స్పష్టత ఇవ్వలేదన్నారు. మాజీ ఆర్మీ చీఫ్ జనరల్ ఎం.ఎం. నరవాణే రాసిన స్మృతిగ్రంథం (మెమోయర్) అంశాన్ని ప్రస్తావిస్తూ ప్రభుత్వం సభను తప్పుదోవ పట్టించిందని ఖర్గే ఆరోపించారు.

#### - ప్రభుత్వం ఎందుకు ఇబ్బందిపడింది

"ఆ పుస్తకం ఇప్పటికే ప్రచురితమై మా చేతుల్లో ఉంది. అయితే అది ప్రచురించలేదని రక్షణ మంత్రి పార్లమెంట్‌లో ఎలా చెబుతారు? ఇది మీ కళ్ల ముందే ఉన్న విషయం" అంటూ ప్రశ్నించారు. హోంమంత్రి అమిత్ షా, రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ కూడా అదే విషయాన్ని పునరావృతం చేశారని, చివరికి రాహుల్ గాంధీ సభలో పుస్తకాన్ని చూపించిన తర్వాత నిజం బయటపడిందన్నారు. అలాగే లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ చైనా అంశాన్ని లేవనెత్తినప్పుడు ప్రభుత్వం ఎందుకు ఇబ్బందిపడిందని ఖర్గే ప్రశ్నించారు.నిజం వినండి, సమాధానం ఇవ్వండి. లేదంటే ఖండించండి" అని వ్యాఖ్యానించారు. ప్రధాని ప్రసంగంలో విషయపరమైన సమాధానాలు లేకపోవడంతోనే ప్రతిపక్షం వాకౌట్ చేసినట్లు చెప్పారు. "మేం లేవనెత్తిన సమస్యలకు ఆయన దగ్గర సమాధానం లేదు. తర్వాత మాపై విమర్శలు చేయడమే చేశారు" అని విమర్శించారు. సిక్కు సమాజాన్ని అవమానించామన్న ఆరోపణలను కూడా ఖర్గే ఖండించారు. "సిక్కు సమాజాన్ని మేం గౌరవిస్తాం. డాక్టర్ మన్మోహన్ సింగ్ దేశానికి రెండుసార్లు ప్రధానిగా సేవలందించారు" అని గుర్తుచేశారు. గత 10 ఏళ్లుగా కాంగ్రెస్‌పై విమర్శలు చేయడమే తప్ప ప్రజల సమస్యల పరిష్కారంపై ప్రభుత్వం దృష్టి పెట్టలేదని ఖర్గే ఆరోపించారు.


#### - ప్రధాని ప్రసంగం అంతా అసత్యాలతోనే

అదే సమయంలో కాంగ్రెస్ సీనియర్ నేత జైరాం రమేశ్? కూడా ప్రధాని ప్రసంగంపై తీవ్ర విమర్శలు చేశారు. రాజ్యసభలో ప్రతిపక్షం లేవనెత్తిన కీలక అంశాలకు ప్రధాని సమాధానం ఇవ్వలేదని ఆరోపించారు. "ప్రధాని ప్రసంగం అసత్యాలతో, అసహనంతో నిండి ఉంది. 97 నిమిషాల ప్రసంగం నిరాశాజనకం" అంటూ ఎక్స్ వేదికగా స్పందించారు. అంతర్జాతీయ అంశాలపై కూడా కేంద్ర ప్రభుత్వం మౌనం పాటిస్తోందని రమశ్ ఆరోపించారు. భారత్- పాకిస్థాన్ మధ్య కాల్పుల విరమణకు అమెరికా మాజీ అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మధ్యవర్తిత్వం చేశానని చేసిన వ్యాఖ్యలపై ప్రధాని స్పందించలేదని ప్రశ్నించారు. అలాగే చైనా అంశంలో కూడా స్పష్టత ఇవ్వలేదని విమర్శించారు.

## ఉత్కంఠ రేపుతున్న మెతుకుసీమ

### ప్రాతినిధ్యం వహిస్తున్న ఉద్దండులు

**టిమీడియా, ఫిబ్రవరి 6 , ఉమ్మడి మెదక్ :**





పురపోరులో ఉమ్మడి మెదక్ జిల్లా ఉత్కంఠ రేపుతోంది. ఉద్దండపిండాలు ఈ జిల్లా నుంచి ప్రాతినిధ్యం వహిస్తుండటంతో మున్సిపల్ వార్‌లో పైచేయి సాధించేందుకు హోరాహోరి తలపడుతున్నారు. మంత్రి దామోదర రాజనర్సింహతోపాటు నియోజకవర్గ ఇంఛార్జులు కాంగ్రెస్ గెలుపు కోసం పనిచేస్తున్నారు.


మిగతా 3లో..


## 9వ తేదీకి లోక్‌సభ వాయిదా

**టిమీడియా, ఫిబ్రవరి 6 , న్యూఢిల్లీ:**



శుక్రవారం 2026-27 కేంద్ర బడ్జెట్‌పై సాధారణ చర్చ ప్రారంభమైన వెంటనే ప్రతిపక్ష ఎంపీల తీవ్ర నిరసనలతో లోక్‌సభ కార్యకలాపాలకు అంతరాయం ఏర్పడింది. దీంతో సభను సోమవారం ఫిబ్రవరి 9 ఉదయం 11 గంటల వరకు వాయిదా వేశారు. ఉదయం 11 గంటలకు పార్లమెంటు దిగువ సభలో కార్యకలాపాలు ప్రారంభం కాగానే, ప్రతిపక్ష ఎంపీలు కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా బిగ్గరగా నినాదాలు చేయడం ప్రారంభించారు. ఆందోళన ఆపాలని ప్రతిపక్ష నాయకులను పదేపదే కోరినా వారు పట్టించుకోకపోవడంతో, సభాపతి ఓం బిర్లా కేవలం 5 నిమిషాల్లోనే సభను మధ్యాహ్నం 12 గంటల వరకు వాయిదా వేశారు.అయితే, మధ్యాహ్నం చర్చను తిరిగి ప్రారంభించడానికి సభ సమావేశమైనప్పుడు వాతావరణంలో ఎలాంటి మార్పు రాలేదు. ప్రతిపక్ష నాయకులు నినాదాలు చేస్తూ, ప్రభుత్వాన్ని విమర్శిస్తూ ప్లకార్డులు ప్రదర్శించడం కొనసాగించారు. లోక్‌సభ కార్యకలాపాలకు అధ్యక్షత వహిస్తున్న కృష్ణ కుమార్ తెన్నేటి, పలువురు ఎంపీలు సమర్పించిన వాయిదా తీర్మాన నోటీసులను స్పీకర్ తిరస్కరించారని తెలిపారు.


మిగతా 3లో..


## విజయ్‌కు మద్రాస్ హైకోర్టులో చుక్కెదురు

- రూ.1.50 కోట్ల పెనాల్టీ చెల్లించాల్సిందే

**టిమీడియా, ఫిబ్రవరి 6 , చైనయ్ :**




తమిళనాడు వెట్రి కళగం అధినేత, ప్రముఖ సినీ నటుడు విజయ్‌కు మద్రాస్ హైకోర్టులో గట్టి ఎదురుదెబ్బ తగిలింది. ఆదాయపు పన్ను శాఖ విధించిన రూ.1.50 కోట్ల భారీ జరిమానాను రద్దు చేయాలని కోరుతూ ఆయన దాఖలు చేసిన పిటిషన్‌ను న్యాయస్థానం శుక్రవారం కొట్టివేసింది.


మిగతా 3లో..

# జోరుగా గులాబీ శ్రేణుల ప్రచారం

• పాల్గొననున్న మాజీ మంత్రి హరీశ్‌రావు



**టిమీడియా, ఫిబ్రవరి 6 , మంచిర్యాల:**
ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లావ్యాప్తంగా మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో బీఆర్ఎస్ పార్టీ ప్రచార హోరు పెంచింది. మాజీ మంత్రులు, ఎమ్మెల్యేలు, మాజీ ఎమ్మెల్యేలు, బీఆర్ఎస్ ఎన్నికల ఇన్‌చార్జిలు, ముఖ్యనాయకులు క్షేత్రస్థాయిలో ప్రచారం నిర్వహిస్తున్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా నేడు(శుక్రవారం) మాజీ మంత్రి హరీశ్‌రావు మంచిర్యాల జిల్లాలో పర్యటించనున్నారు. క్యాతన్‌పల్లి మున్సిపాలిటీలో గల రాజీవ్‌చౌక్‌లో నిర్వహించే రోడ్‌షోలో పాల్గొంటారు. అక్కడి నుంచి బెల్లంపల్లి రోడ్‌షోలో ప్రజలనుద్దేశించి మాట్లాడుతారు. స్థానికంగా నిర్వహించే ప్రచారంలో పాల్గొంటారు. ఈ మేరకు బీఆర్ఎస్ నాయకులు ఏర్పాట్లు చేస్తున్నారు. హరీశ్‌రావు పర్యటన సందర్భంగా క్యాతన్‌పల్లి బల్దియాలో బీఆర్ఎస్ మంచిర్యాల జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్ ఏర్పాట్లను పర్యవేక్షించారు. రాజీవ్‌చౌక్‌లో రోడ్ షో నేపథ్యంలో ఏర్పాట్లపై నాయకులకు దిశానిర్దేశం చేశారు. హరీశ్‌రావు పర్యటన సందర్భంగా మంచిర్యాల జిల్లాలోని మిగిలిన మున్సిపాలిటీల నుంచి జనాలుతరలిరానున్నారు. ఇప్పటికే వరుస చేరికలతో బీఆర్ఎస్ జోష్ మీద ఉండగా, మాజీ మంత్రి హరీశ్‌రావు రాక పార్టీకి, పోటీ చేస్తున్న అభ్యర్థులకు బలం చేకూర్చనున్నది.

**క్షేత్రస్థాయిలో కదులుతున్న కార్యకర్తలు**

మున్సిపాలిటీ ఎన్నికల ప్రచారంలో బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొంటూ హోరెత్తిస్తున్నారు. మంచిర్యాల మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో మాజీ ఎమ్మెల్యే దివాకర్‌రావు, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు విజిత్‌రావు డివిజన్‌లలో పర్యటిస్తున్నారు. బీఆర్ఎస్ మంచిర్యాల జిల్లా అధ్యక్షుడు, చెన్నూర్ మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్ జిల్లాలో సమన్వయ సమావేశాలతోపాటు ప్రచార కార్యక్రమాల్లో పాల్గొంటున్నారు. చెన్నూర్, క్యాతన్‌పల్లి మున్సిపాలిటీలపై ప్రత్యేక దృష్టి సారించి, గెలుపే లక్ష్యంగా ముందుకు సాగుతున్నారు. బెల్లంపల్లిలో మాజీ ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య తనదైన శైలిలో పర్యటనలు, ప్రచారాలు చేస్తూ దూసుకుపోతున్నారు. ఆసిఫాబాద్ జిల్లాలో ఎన్నికల ఇన్‌చార్జి, ఎమ్మెల్సీ దాసోజు శ్రావణ్ ఆధ్వర్యంలో ఆసిఫాబాద్ మున్సిపాలిటీలో ఎమ్మెల్యే కోవ లక్ష్మి, కాగజ్‌నగర్‌లో బీఆర్ఎస్ రాష్ట్ర కార్యదర్శి ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్, మాజీ ఎమ్మెల్యే కోనేరు కోనప్ప గెలుపే లక్ష్యంగా ముందుకు సాగుతున్నారు. నిత్యం రివ్యూ మీటింగ్‌లు పెడుతూ.. క్షేత్రస్థాయి ప్రచారంలో దూసుకుపోతున్నారు. ఆదిలాబాద్ మున్సిపాలిటీలో మాజీ మంత్రి జోగు రామన్న రోజు నాలుగైదు వార్డుల్లో ప్రచారం చేస్తున్నారు. నిర్మల్ మున్సిపాలిటీలో పార్టీ ఎన్నికల ఇన్‌చార్జి అనిల్ జాదవ్ ఆధ్వర్యంలో నియోజకవర్గ ఇన్‌చార్జి రాంకిషన్‌రెడ్డి నిత్యం ప్రజల్లో ఉంటున్నారు. ఖానాపూర్ మున్సిపాలిటీలో జాన్సన్ నాయక్ ప్రచార కార్యక్రమాలతో ప్రజల మధ్యే ఉంటున్నారు. ఇలా ఎక్కడి నేతలు అక్కడ ప్రచారాల్లో పాల్గొంటూ అభ్యర్థులకు భరోసా కల్పిస్తున్నారు. ఎన్నికల్లో మంచి ఫలితాలు సాధించే దిశగా కృషి చేస్తున్నారు.

# సీఎం సభలో వివాదం

• డీసీసీ అధ్యక్షుడు ఫొటో లేకుండా ఫ్లెక్సీలు

**టిమీడియా, ఫిబ్రవరి 6 , కరీంనగర్:**
కరీంనగర్ జిల్లా కాంగ్రెస్ పార్టీలో అంతర్గత విభేదాలు మరోసారి బహిరంగంగా రగిలాయి. సీఎం రేవంత్‌రెడ్డి చిత్రంతో ఏర్పాటు చేసిన స్వాగత ఫ్లెక్సీ వ్యవహారం జిల్లాలో కాంగ్రెస్ నాయకత్వంపై ప్రశ్నలు తలెత్తేలా చేసింది. చొప్పదండి నియోజకవర్గ పరిధిలో సీఎం రేవంత్‌రెడ్డి పర్యటన సందర్భంగా ఏర్పాటు చేసిన స్వాగత ఫ్లెక్సీల్లో స్థానిక ఎమ్మెల్యే, డీసీసీ అధ్యక్షుడు మేడిపల్లి సత్యం ఫొటో లేకపోవడం వివాదానికి దారి తీసిం ది.ఇది సాధారణ పొరపాటు కాదని, కావాలనే తమ నాయకుడిని రాజకీయంగా పక్కన పెట్టే ప్రయత్నం జరుగుతోందని సత్యం అనుచరులు తీవ్ర స్థాయిలో మండిపడుతున్నారు. పార్టీ క్రమశిక్షణను పట్టించుకో కుండా నియోజకవర్గ ఇన్‌చార్జ్ వెలిచాల రాజేందర్‌రావు వర్గీయులు ఏకపక్షంగా వ్యవహరించారని ఆరోపిస్తున్నారు.ఇప్పటికే జిల్లాలో పలువురు నేతల మధ్య ఆధిపత్య పోరు కొనసాగుతుండగా, తాజా ఘటనతో వర్గ విభేదాలు మరింత బహిర్గతమయ్యా యి. ముఖ్యంగా మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో పార్టీ ఐక్యత అవసరమైన సమ యంలో నేతలు పరస్పరం రాజకీయంగా పైచేయి సాధించేందుకు ప్రయత్నించడం పార్టీకి నష్టం కలిగించే ప్రమాదం ఉందని కార్యకర్తలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.జిల్లాలో కాంగ్రెస్ బలోపేతానికి నాయకులు సమన్వయంతో పనిచేయాల్సిన అవస రం ఉన్నప్పటికీ, వ్యక్తిగత రాజకీయ అజెండాలతో ముందుకు సాగడం వల్ల పార్టీ ప్రతి ష్ఠ దెబ్బతింటోందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. అధిష్టానం ఈ వ్యవహారాన్ని సీరియస్‌గా తీసుకుని వర్గపోరుకు చెక్ పెట్టకపోతే పార్టీకి ఇబ్బందులు తలెత్తే అవకాశ ముందని పార్టీ శ్రేణులు భావిస్తున్నాయి. మరోవైపు, ఈ వివాదం కాంగ్రెస్ ప్రత్యర్థి పార్టీలకు రాజకీయ ఆయుధంగా మారే అవకాశముందని విశ్లేషకులు అంటున్నారు.




# టీ కొట్టులో గంజాయి అమ్మకాలు..

• జీతం కంటే రెట్టింపు సంపాదన






**టిమీడియా, ఫిబ్రవరి 6 ,హైదరాబాద్;**
టీ.. పొద్దున్న లేస్తే టీ, ఆఫీసుకు వెళ్తే టీ, బ్రేక్ టైంలో టీ, ఆఫీసు నుంచి ఇంటికి వచ్చేటప్పుడు టీ, ఇంటికొచ్చాక మరో టీ..ఇలా రోజులో కనీసం నాలుగైదు సార్లయినా టీ షాపు దగ్గరికి వెళ్లేవారు చాలామంది. ఎవరైనా టీ షాపులో టీ కోసమే వెళ్తాము, మహా అయితే టీతో పాటు సమోసా, సిగరెట్ తీసుకుంటాం.. కానీ టీ షాపులో గంజాయి అమ్మడం ఎక్కడైనా చూశారా..? అవును హైదరాబాద్ లోని ఓ టీ షాపులో పబ్లిక్ గా గంజాయి అమ్ముతున్నారు. అది కూడా ఓనర్ కి తెలీకుండా వర్కర్ గంజాయి అమ్ముతున్నాడు.హైదరాబాద్ లోని ఉప్పల్ లో టీ కొట్టులో గంజాయి అమ్ముతున్న వ్యక్తిని అరెస్ట్ చేశారు పోలీసులు. ఇందుకు సంబంధించి వివరాలిలా ఉన్నాయి..హైదరాబాద్ లోని ఉప్పల్ లో హెడ్ పోస్టాఫీసు ఎదురుగా ఉన్న టీ కొట్టులో పని చేసే ఉద్యానాథ్ గంజాయి అమ్ముతున్నట్లు సమాచారం అందుకున్న పోలీసులు శుక్రవారం ( ఫిబ్రవరి 6 ) ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. గంజాయి అమ్ముతున్న ఉద్యానాథ్ ను అరెస్ట్ చేశారు పోలీసులు. ఉద్యానాథ్ గంజాయి అమ్మకాల ద్వారా ఓనర్ ఇచ్చే జీతం కంటే రెట్టింపు ఆదాయం సంపాదిస్తున్నట్లు తెలిపారు పోలీసులు.ఉద్యానాథ్ టీకొట్టుకు వచ్చిన కస్టమర్లకు టీతోపాటు రూ.500కు గంజాయి ప్యాకెట్‌ను అమ్ముతున్నట్లు గుర్తించారు పోలీసులు. టీకొట్టు దగ్గరే స్కూటిలో గంజాయి పెట్టి అమ్ముతున్నట్లు తెలిపారు. ఓనర్ తెలీకుండా బీదర్ నుంచి గంజాయి తెప్పించి అమ్ముతున్నట్లు తెలిపారు పోలీసులు.పక్కా సమాచారంతో టీకొట్టుపై దాడి చేసిన పోలీసులు నిందితుడిని అదుపులోకి తీసుకొని.. అతని దగ్గరి నుంచి 730 గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. నిందితుడని, గంజాయిని, స్కూటీని ఉప్పల్ ఎక్సైజ్ స్టేషన్‌లో అప్పగించినట్లు తెలిపారు పోలీసులు

# జలంధర్‌లో ఆప్ నేత హత్య

**టిమీడియా, ఫిబ్రవరి 6 , జలంధర్:**
పంజాబ్‌లోని జలంధర్‌లో శుక్రవారం పగటిపూట ఒక గురుద్వారా( వెలుపల ద్విచక్ర వాహనంపై వచ్చిన గుర్తు తెలియని దుండగులు కాల్పులు జరపడంతో ఆమ్ ఆద్మీ పార్టీ (ఆప్) నాయకుడు లక్కీ ఒబెరాయ్ మరణించారు. ప్రాథమిక సమాచారం ప్రకారం, మోడల్ టౌన్‌లోని గురుద్వారా వెలుపల ఒబెరాయ్‌పై పలుమార్లు కాల్పులు జరిపారు. అతను తన కారులో ఉన్నప్పుడు ఐదు బుల్లెట్లు అతనికి తగిలాయి. అతడిని వెంటనే చికిత్స కోసం ఒక ప్రైవేట్ ఆసుపత్రికి తరలించగా, అక్కడ గాయాల కారణంగా అతను మరణించాడు.ఒబెరాయ్ గురుద్వారా బయట తన కారును పార్క్ చేస్తుండగా, ఇద్దరు దుండగులు ద్విచక్ర వాహనంపై వచ్చి అతనిపై కాల్పులు జరిపారు. ఈ ఘటనపై పోలీసు అధికారులు తక్షణమే స్పందించారు. సమాచారం అందిన వెంటనే ఒక పోలీసు బృందం సంఘటనా స్థలానికి చేరుకుని కేసు దర్యాప్తు ప్రారంభించింది. లక్కీ ఒబెరాయ్ భార్య గతంలో ఆమ్ ఆద్మీ పార్టీ అభ్యర్థిగా మున్సిపల్ ఎన్నికల్లో పోటీ చేసి విఫలమయ్యారు. జలంధర్‌లో పగటిపూట ఒబెరాయ్ హత్య జరిగిన తర్వాత, పంజాబ్ శాసనసభలో ప్రతిపక్ష నాయకుడు ప్రతాప్ సింగ్ బాజ్వా రాష్ట్ర ప్రభుత్వంపై తీవ్ర విమర్శలు చేశారు. ముఖ్యమంత్రి భగవంత్ మాన్ పరిపాలనలో పంజాబ్‌లో శాంతిభద్రతల పరిస్థితి పూర్తిగా కుప్పకూలిపోయిందని ఆరోపించారు.




## వాంటెడ్ క్రిమినల్ ఎన్‌కౌంటర్



**టిమీడియా, ఫిబ్రవరి 6 , ముజఫర్‌నగర్:**
షామ్లీ జిల్లాలో పోలీసులతో జరిగిన ఎదురుకాల్పుల్లోతలపై రూ. 50,000 బహుమతి ఉన్న వాంటెడ్ క్రిమినల్ మరణించాడని అధికారులు శుక్రవారం తెలిపారు. షమ్లీ పోలీసు సూపరింటెండెంట్ ఎన్ పి సింగ్ మాట్లాడుతూ, రిహాన్ అన్సారీ అని గుర్తించబడిన ఆ నిందితుడు ఢిల్లీ, జాతీయ రాజధాని ప్రాంతం (ఎన్‌సిఆర్)లో నమోదైన సుమారు 90 క్రిమినల్ కేసులలో వాంటెడ్ నిందితుడని తెలిపారు. గురువారం రాత్రి పొద్దుపోయాక, రిహాన్ రోడ్డు దోపిడీకి పాల్పడినట్లు ఆరోపణలు రావడంతో పోలీసులు అతడిని అడ్డగించారని, ఆ సమయంలోనే ఈ ఎన్‌కౌంటర్ జరిగిందని ఎస్పీ తెలిపారు.పోలీసు బృందం అతడిని ఆపడానికి ప్రయత్నించినప్పుడు, అతను పారిపోవడానికి ప్రయత్నించి కాల్పులు జరిపాడు. ప్రతిగా జరిపిన కాల్పుల్లో అతను గాయపడ్డాడు. తరువాత మరణించాడని సింగ్ తెలిపారు. అతని వద్ద నుండి పోలీసులు రెండు పిస్టళ్లు, ఒక మోటార్ సైకిల్, దోచుకున్న ఒక మొబైల్ ఫోన్, రెండు ఉంగరాలను స్వాధీనం చేసుకున్నారని పోలీసులు తెలిపారు. ఇరుపక్షాల మధ్య జరిగిన కాల్పుల సమయంలో, సుమిత్ కుమార్ అనే పోలీసు కానిస్టేబుల్‌కు బుల్లెట్ గాయమైంది. అతడిని ఆసుపత్రికి తరలించారు. ప్రస్తుతం అతని పరిస్థితి నిలకడగా ఉన్నట్లు తెలిసింది. తదుపరి న్యాయపరమైన చర్యలు కొనసాగుతున్నాయని పోలీసులు తెలిపారు.

## కొడిమ్యాల వాసి ఇస్రో సైంటిస్ట్

**టి మీడియా, ఫిబ్రవరి 6, కొడిమ్యాల :**
జగిత్యాల జిల్లా కొడిమ్యాల మండల కేంద్రానికి చెందిన ముమ్మాడి రాజసింహ ఇస్రోలో సైంటిస్ట్/ఇంజనీర్ ఉద్యోగానికి ఎంపికయ్యాడు. రాజసింహ తల్లిదండ్రులు రాజశేఖర్, ఉమారాణిలు ప్రభుత్వ ఉపాధ్యాయులుగా విధులు నిర్వర్తిస్తున్నారు. రాజసింహ జగిత్యాల జిల్లా కేంద్రంలోని శ్రీనిధి హైస్కూల్ లో పదోతరగతి, వరంగల్ ఎస్ఆర్ కాలేజీలో ఇంటర్మీడియట్ పూర్తి చేశాడు. జేఈఈ అడ్వాన్స్ తో కేరళలోని తిరువనంతపురం ఇండియన్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ స్పేస్ సైన్స్ అండ్ టెక్నాలజీలో బీటెక్ ఏరో స్పేస్ ఇంజనీరింగ్ లో సీటు సాధించాడు. బీటెక్ చివరి సంవత్సరంలో ఐఐఎస్టీ గ్రాడ్యుయేట్స్ కి నిర్వహించిన క్యాంపస్ రిక్రూట్మెంట్లో సైంటిస్ట్/ఇంజనీర్ ఉద్యోగానికి ఎంపిక అయ్యాడు. ఈ సందర్భంగా రాజసింహను బంధుమిత్రులు అభినందించి కృతజ్ఞతలు తెలిపారు.




## బిఆర్ఎస్ నాయకులపై దాడులను నిరసిస్తూ ధర్నా

**టి మీడియా, ఫిబ్రవరి 6,మేడ్చల్:**
బిఆర్ఎస్ పార్టీ నాయకులపై జరుగుతున్న దాడులను తీవ్రంగా నిరసిస్తూ, కాంగ్రెస్ పార్టీకి చెందిన వజ్రేష్ యాదవ్‌పై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ జీనోమ్ వ్యాలీ పోలీస్ స్టేషన్ ముందు బిఆర్ఎస్ మేడ్చల్ జిల్లా అధ్యక్షులు, ఎమ్మెల్సీ శంబీపూర్ రాజు ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ నిరసన కార్యక్రమంలో ఎమ్మెల్సీ శంబీపూర్ రాజుతో పాటు మాజీ మంత్రి, మేడ్చల్ శాసనసభ్యులు మల్లారెడ్డి, మల్కాజ్గిరి శాసనసభ్యులు మర్రి రాజశేఖర్ రెడ్డి, పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. బిఆర్ఎస్ నాయకులపై దాడి చేసిన వారిని వెంటనే అరెస్ట్ చేయాలని డిమాండ్ చేస్తూ, పార్టీ శ్రేణులతో కలిసి పోలీస్ స్టేషన్ ముందు బైఠాయించి ఆందోళన చేపట్టారు.



## చెట్టుపైనే ప్రాణాలు విడిచిన గీత కార్మికుడు

**టిమీడియా, ఫిబ్రవరి 6 ,తంగళ్ళపల్లి:**
రాజన్న సిరిసిల్ల జిల్లా తంగళ్ళపల్లి మండలం జిల్లెల్ల గ్రామంలో విషాద ఘటన చోటుచేసుకుంది. కల్లు గీయడానికి తాటి చెట్టు ఎక్కిన సాయి కిషన్ (గౌడన్న) అనే గీత కార్మికుడు చెట్టుపైనే అకస్మాత్తుగా మృతి చెందాడు. సమాచారం అందుకున్న స్థానికులు ఆయనను కిందకు దింపేందుకు ప్రయత్నించినప్పటికీ అప్పటికే ప్రాణాలు కోల్పోయినట్లు తెలిసింది. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉండగా, కుటుంబంలో తీవ్ర విషాదం నెలకొంది. ఘటనకు సంబంధించిన మరిన్ని వివరాలు తెలియాల్సి ఉంది.



## ఇంటర్ కళాశాలల గుర్తింపు ప్రక్రియ ప్రారంభం

**టిమీడియా, ఫిబ్రవరి 6 , హైదరాబాద్:**
తెలంగాణ రాష్ట్రంలోని జూనియర్ కళాశాలల నిర్వహణ , అఫిలియేషన్ ప్రక్రియలో ఇంటర్మీడియట్ విద్యా మండలి కీలక మార్పులను ప్రవేశపెట్టింది. 2026-27 విద్యా సంవత్సరానికి గానూ కళాశాలల అనుబంధ గుర్తింపు కోసం దరఖాస్తుల ప్రక్రియ ఫిబ్రవరి 12, 2026 నుండి ఆన్‌లైన్ వేదికగా ప్రారంభం కానుంది. విద్యా సంస్థలు ఎలాంటి అదనపు రుసుము చెల్లించకుండా దరఖాస్తు చేసుకోవడానికి మార్చి 13, 2026 వరకు గడువు ఇచ్చారు. ఒకవేళ నిర్ణీత సమయంలోగా దరఖాస్తు చేయని పక్షంలో, గరిష్టంగా ?20,000 ఆలస్య రుసుముతో ఏప్రిల్ 17, 2026 వరకు అవకాశం కల్పించారు. ఈసారి దరఖాస్తులు , ఫీజు చెల్లింపుల ప్రక్రియను పూర్తిగా డిజిటలైజ్ చేసిన బోర్డు, ఆఫ్‌లైన్ ద్వారా వచ్చే డిమాండ్ డ్రాఫ్ట్ )లు లేదా చలాన్లను ఎట్టి పరిస్థితుల్లోనూ ఆమోదించబోమని స్పష్టమైన ఆదేశాలు జారీ చేసింది.కళాశాలల నాణ్యత , భద్రత విషయంలో బోర్డు ఈసారి అత్యంత కఠినమైన నిబంధనలను అమలు చేస్తోంది. దరఖాస్తు చేసే సమయంలో కళాశాల యాజమాన్యాలు తమ వద్ద ఉన్న ఫిక్స్ డిపాజిట్ రశీదు , భవనానికి సంబంధించిన రిజిస్టర్డ్ లీజు పత్రం, , అత్యంత కీలకమైన ఫైర్ సేఫ్టీ సర్టిఫికేట్‌తో పాటు శానిటరీ, బిల్డింగ్ సౌండ్‌నెస్ సర్టిఫికేట్లు చట్టబద్ధంగా అమలులో ఉండాలని సూచించింది. వీటితో పాటు బోధనా సిబ్బంది వివరాలు , వారి విద్యార్హత పత్రాలను కూడా ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేయడం తప్పనిసరి చేశారు. ముఖ్యంగా, అదనపు వసతులు కల్పించకుండా కేవలం కోరుకునే అదనపు సెక్షన్ల ప్రతిపాదనలను బోర్డు నేరుగా తిరస్కరిస్తుంది. ముందస్తు అనుమతి లేకుండా కొత్త సెక్షన్లు ప్రారంభించడం నిబంధనల ఉల్లంఘనగా పరిగణించబడుతుంది.కళాశాలల్లో చేయాలనుకునే మార్పుల విషయంలో కూడా మండలి స్పష్టమైన గడువును విధించింది. కళాశాల పేరు మార్చడం, ఒకే మండలం పరిధిలో స్థలం మార్చడం లేదా కో-ఎడ్యుకేషన్‌కు సంబంధించిన మార్పులు చేయాలనుకునే వారు తమ అఫిలియేషన్ ప్రతిపాదనలతో పాటే ఏప్రిల్ 17లోపు దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది. ఒకవేళ ఏ కళాశాలైనా నిబంధనలను అతిక్రమిస్తే భారీ జరిమానాలు విధించడంతో పాటు, ఆ కళాశాల గుర్తింపును శాశ్వతంగా రద్దు చేసే అధికారం విద్యా మండలికి ఉంటుంది. ఈ నిబంధనలన్నీ విద్యార్థుల భద్రతను , విద్యా ప్రమాణాలను మెరుగుపరచడమే లక్ష్యంగా రూపొందించబడ్డాయి.




## పెద్దపులి చిక్కింది..మత్తు ఇచ్చి పట్టుకున్నారు

**టిమీడియా, ఫిబ్రవరి 6 , తూర్పు గోదావరి జిల్లా :**
ఐదు రోజులుగా తూర్పు గోదావరి జిల్లా జనాన్ని ముప్పు తిప్పలు పెట్టిన పెద్దపులి దొరికేసింది. జిల్లాలోని పలు గ్రామాల్లో సంచరిస్తూ ఆవులు, దూడలపై దాడి చేసి చంపిన పెద్దపులిని ఎట్టకేలకు పట్టుకున్నారు అధికారులు. శుక్రవారం ( ఫిబ్రవరి 6 ) రాయవరం మండలం కూర్మాపురంలో పాడుబడ్డ ఇంట్లో చొరబడ్డ పెద్దపులిని మత్తు ఇంజక్షన్ ఇచ్చి పట్టుకున్నారు అధికారులు.పెద్దపులిని పట్టుకునేందుకు పూణే నుంచి వచ్చిన రెస్క్యూ టీం నిర్వహించిన ఆపరేషన్ సక్సెస్ అయ్యింది. పాడుబడ్డ ఇంటి బయట గన్స్, బోనులతో పహారా కాసిన రెస్క్యూ టీమ్స్ మత్తు ఇంజక్షన్ ఇచ్చి పెద్దపులిని పట్టుకున్నారు.పాడుబడ్డ ఇంటి చుట్టూ ఫెన్సింగ్ ఏర్పాటు చేసి ఫ్లడ్ లైట్స్ పెట్టడంతో పెద్దపులి బయటికొచ్చింది. ఫ్లడ్ లైట్ల వెలుతురులో పులిని గురి చూసి మత్తు ఇంజక్షన్ షూట్ చేశారు రెస్క్యూ సిబ్బంది. కంటి నిండా నిద్ర లేకుండా చేసిన పెద్దపులి చిక్కడంతో ఊపిరి పీల్చుకున్నారు జిల్లా వాసులు.మత్తు ఇంజక్షన్ ఇచ్చిన కొద్దిసేపటికి అపస్మారక స్థితిలోకి వెళ్లిపోయిన పెద్దపులిని బోనులో బంధించి అటవీ ప్రాంతంలో వదిలేందుకు తీసుకెళ్లారు అధికారులు.





## స్వేచ్ఛగా తమ ఓటు హక్కును వినియోగించు

• రామగుండం సీపీ అంబర్ కిషోర్ ఝా


**టిమీడియా, ఫిబ్రవరి 6 , పెద్దపల్లి:**
మున్సిపల్ ఎన్నికలను ప్రశాంత వాతావరణంలో సజావుగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేసినట్లు రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా తెలిపారు. శుక్రవారం పెద్దపల్లి మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో పెద్దపల్లి పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల, శాంతినగర్‌లోని పోలింగ్ కేంద్రాల పరిసరాల్లో చేపట్టిన భద్రతా ఏర్పాట్లను ఆయన పరిశీలించారు. అనంతరం ఎస్సైలు, సీఐలు, ఏసీపీలు, డీసీపీతో సమావేశమై ఎన్నికల నిర్వహణపై చర్చించి అవసరమైన ఆదేశాలు, సూచనలు జారీ చేశారు.ప్రజాస్వామ్యంలో ఎన్నికలు అత్యంత కీలకమైనవని,ప్రతి ఓటరు ఎలాంటి భయం, ఒత్తిడి లేదా ప్రలోభాలకు లోనుకాకుండా స్వేచ్ఛగా తన ఓటు హక్కును వినియోగించుకునేలా పోలీస్ యంత్రాంగం పూర్తి స్థాయిలో భద్రతా చర్యలు చేపట్టిందని పేర్కొన్నారు. ప్రతి పోలింగ్ కేంద్రం వద్ద పటిష్టమైన భద్రత ఏర్పాటు చేయాలని, సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల్లో కట్టుదిట్టమైన బందోబస్తు నిర్వహించాలని అధికారులను ఆదేశించారు.ప్రజలు శాంతియుత వాతావరణంలో నిర్భయంగా తమ ఓటు హక్కును వినియోగించుకునేలా పోలీసులు అన్ని విధాలుగా ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. ఎన్నికల కోడ్‌ను ఉల్లంఘించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పెద్దపల్లి డీసీపీ బి. రామ్ రెడ్డి, పెద్దపల్లి ఏసీపీ జి.కృష్ణ, పెద్దపల్లి సీఐ ప్రవీణ్ కుమార్, ఎస్సై లక్ష్మణ్ రావు తదితరులు పాల్గొన్నారు.



## దొంగలమర్రి సమీపంలో దుర్వాసన

**టి మీడియా, ఫిబ్రవరి 6, కొడిమ్యాల :**
జగిత్యాల, కరీంనగర్ ప్రధాన రహదారిలోని కొడిమ్యాల మండలం దొంగలమర్రి పోలీసు చెక్ పోస్ట్ సమీపంలోని అటవీ(గుట్ట)ప్రాంతంలో గత కొన్ని రోజుల నుండి దుర్వాసన వెదజల్లుతోంది. ఈ ప్రధాన రహదారి మీదుగా వెళ్లే వాహనదారులు, ప్రయాణికులు దుర్వాసనతో ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. సంబంధిత అధికారులు దుర్వాసనకు గల కారణాలను తెలుసుకొని దుర్వాసన నుండి విముక్తి కల్గించాలని కోరుతున్నారు.

## రాజస్థాన్ హైకోర్టుకు బాంబు బెదిరింపు




**టిమీడియా, ఫిబ్రవరి 6, జైపూర్:**
బాంబు బెదిరింపుల నేపథ్యంలో శుక్రవారం జైపూర్, జోధ్‌పూర్‌లోని రాజస్థాన్ హైకోర్టుప్రాంగణంలో తీవ్ర భయాందోళనలు నెలకొన్నాయని పోలీసులు తెలిపారు. పోలీసుల ప్రకారం, హైకోర్టు రిజిస్ట్రార్‌కు ఉదయం ఒక ఈమెయిల్ వచ్చింది. అందులో కోర్టు ప్రాంగణంలో మూడు బాంబులు అమర్చినట్లు పేర్కొన్నారు. హైకోర్టు పరిపాలన విభాగం పోలీసులకు సమాచారం ఇచ్చి, వెంటనే ప్రాంగణాన్ని ఖాళీ చేయాలని ఆదేశించింది. జైపూర్, జోధ్‌పూర్‌లోని హైకోర్టు ప్రాంగణానికి బాంబు నిర్వీర్య బృందాలు, డాగ్ స్క్వాడ్ బృందాలను తరలించారు.

# కాంగ్రెస్ కోఆర్డినేటర్లుగా బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు!




**టిమీడియా, ఫిబ్రవరి 6 , హైదరాబాద్:**
తెలంగాణలో మున్సిపల్, కార్పొరేషన్ ఎన్నికల ప్రచార హడావిడితో రాజకీయం వేడెక్కింది. అందుకు కాంగ్రెస్, బీజేపీ, బీఆర్ఎస్‌తో పాటు మిగతా పార్టీలన్నీ మున్సిపాలిటీల్లో విజయం కోసం తమ వ్యూహాలకు పదును పెట్టాయి. అందుకు అధికార కాంగ్రెస్ పార్లమెంట్ నియోజకవర్గాలకు మంత్రులను ఇన్‌చార్జ్‌లుగా నియమించిన విషయం తెలిసిందే. తాజాగా 116 మున్సిపాలిటీలు, 7 కార్పొరేషన్లకు అధికార కాంగ్రెస్ పార్టీ కో ఆర్డినేటర్ల జాబితాను గురువారం విడుదల చేసింది. ఈ జాబితాలో బీఆర్ఎస్ ఎమ్మెల్యేల పేర్లు కూడా ఉండటం చర్చనీయాంశంగా మారింది. ఇటీవలనే 8 మంది ఎమ్మెల్యేలకు సంబంధించి అనర్హత పిటిషన్లను స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ డిస్మిస్ చేశారు. పార్టీ మారినట్లుగా ఎలాంటి ఆధారాలూ లేనందున అనర్హత పిటిషన్లు కొట్టేసినట్లుగా స్పీకర్ కార్యాలయం పేర్కొన్న విషయం తెలిసిందే. వీరిలో ఇప్పుడు ముగ్గురు బీఆర్ఎస్ ఎమ్మెల్యేలకు కాంగ్రెస్ పార్టీ మున్సిపల్ ఎన్నికల బాధ్యతను అప్పగించింది. నిజామాబాద్ కార్పొరేషన్ కో ఆర్డినేటర్‌గా శేరిలింగంపల్లి ఎమ్మెల్యే అరికటపూడి గాంధీ, ఇల్లందు మున్సిపాలిటీకి భద్రాచలం ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావ్, షాద్‌నగర్ మున్సిపాలిటీకి రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్ పేర్లు టీపీసీసీ జారీచేసిన జాబితాలో దర్శనమిచ్చాయి.

**- వివిధ కార్పొరేషన్లకు కో ఆర్డినేటర్లు..**
నిజామాబాద్ - మాజీమంత్రి జీవన్‌రెడ్డి, ఎమ్మెల్యే అరికపూడి గాంధీ, ఎమ్మెల్సీ బల్మూర్ వెంకట్, ఈరావత్రి అనిల్ లి రామగుండం - పురానం సతీష్‌కుమార్ లి మంచిర్యాల- ఎమ్మెల్యే శ్రీగణేష్ లి కరీంనగర్ - ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి, దొమ్మాటి సాంబయ్య లి నల్లగొండ - ఎంఆర్‌జీ వినోద్‌రెడ్డి , మహబూబ్‌నగర్ - ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి



## చిన్నారికి ఉచిత చికిత్స

- సీఎం రేవంత్ రెడ్డి హామీ

**టిమీడియా, ఫిబ్రవరి 6, హైదరాబాద్**
హైదరాబాద్‌కు చెందిన రెండేళ్ల చిన్నారి ఫినెహాస్ అక్యూట్ లింఫోబ్లాస్టిక్ లుకేమియా వ్యాధితో బాధపడుతున్నారని తెలిసి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వెంటనే స్పందించారు. ఆ చిన్నారికి వైద్య చికిత్స చేయించేందుకు తక్షణం అవసరమైన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు వెంటనే అధికారులు కుటుంబ సభ్యులతో పాటు బసవతారకం ఇండో-అమెరికన్ క్యాన్సర్ ఆసుపత్రి అధికారులతో మాట్లాడారు. చిన్నారిని ఆసుపత్రిలో చేర్పించాలని సూచించారు. అక్కడ చికిత్స ఖర్చును ప్రభుత్వమే భరిస్తుందని వారికి తెలియజేశారు. వైద్య సేవలను సులభతరం చేయడానికి లెటర్ ఆఫ్ క్రెడిట్ జారీ చేయబడుతుందని ముఖ్యమంత్రి తెలిపారు.

## విజయ్‌కు మద్రాస్ హైకోర్టులో చుక్కెదురు

ఐటీ శాఖ జారీ చేసిన పెనాల్టీ ఆదేశాల్లో ఎలాంటి లోపం లేదని, అది చట్టపరంగానే ఉందని కోర్టు స్పష్టం చేసింది. 2015-16 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి విజయ్ తన ఆదాయ వివరాలను పూర్తిగా వెల్లడించలేదని ఐటీ శాఖ ఆరోపించింది. ఆ ఏడాది విజయ్ రూ. 35.42 కోట్ల ఆదాయాన్ని మాత్రమే చూపించారు. అయితే, 2015లో ఆయన నివాసంలో ఐటీ అధికారులు దాడులు నిర్వహించారు. ఈ సోదాల్లో లభించిన పత్రాల ప్రకారం, 'పులి' సినిమాకు సంబంధించి విజయ్ తీసుకున్న రూ. 15 కోట్ల ఆదాయాన్ని లెక్కల్లో చూపలేదని అధికారులు గుర్తించారు. దీనిని పరిగణనలోకి తీసుకున్న ఆదాయపు పన్ను శాఖ, ఆదాయాన్ని దాచిపెట్టినందుకు గాను 2022, జూన్ 30న విజయ్‌కు రూ. 1.50 కోట్ల జరిమానా విధిస్తూ ఆదేశాలు జారీ చేసింది.

## 9వ తేదీకి లోక్‌సభ వాయిదా

ఆ తర్వాత ఆయన సభా కార్యకలాపాలను ప్రారంభించారు. బీజేపీ ఎంపీ జేపీ నడ్డా సహా కేంద్ర మంత్రులు, ఆ రోజు సవరించిన కార్యకలాపాల జాబితాలో తమ పేర్ల ముందు ఉన్న పత్రాలను సభ ముందు ఉంచడానికి లేచి నిలబడ్డారు. కొద్దిసేపటికే, ప్రతిపక్ష ఎంపీలు బిగ్గరగా నినాదాలు చేస్తూ, ప్లకార్డులు ప్రదర్శిస్తూ స్పీకర్ కుర్చీ దగ్గరకు చేరుకున్నారు. పదే పదే విజ్ఞప్తి చేసినప్పటికీ, ప్రతిపక్ష ఎంపీలు తమ నిరసనను కొనసాగించారు. ఈ గందరగోళం మధ్య, సభాధ్యక్షుడు సోమవారం ఉదయం 11 గంటల వరకు లోక్‌సభ కార్యకలాపాలను నిలిపివేస్తున్నట్లు ప్రకటించారు.

## మూత లేని విద్యుత్ డబ్బా

**పొంచి ఉన్న ముప్పు**

**టి మీడియా, ఫిబ్రవరి 6, కొడిమ్యాల :**



విద్యుత్ డబ్బాకు మూత లేక ప్రమాదకరంగా మారింది. మండల కేంద్రంలోని మెయిన్ రోడ్డుపై మసీదు ఎదురుగా గల విద్యుత్ స్థంభానికి మూత లేకపోవడంతో ప్రమాదం పొంచి ఉంది. సమీపంలోనే విద్యుత్ బిల్లులు వసూలు చేసే కార్యాలయం ఉన్నప్పటికీ వారు పట్టించుకుపోగా నిత్యం ఈ రోడ్డుపై బాటసారులు, వాహనదారులు, మూగజీవులు సంచరిస్తుంటాయి. పొరపాటున విద్యుత్ షాకు జరిగే అవకాశం ఉన్నందున సంబంధిత అధికారులు తక్షణమే ఈ విద్యుత్ డబ్బాకు మూత అమర్చాలని లేదా నూతన డబ్బా అమర్చాలని ప్రజలు కోరుతున్నారు.

## ఎస్జీటీ పోస్టుల రద్దు ప్రతిపాదనను విరమించుకోవాలి

**టి మీడియా, ఫిబ్రవరి 6, కొడిమ్యాల :**



ఉన్నత పాఠశాలల్లో ప్రధానోపాధ్యాయ, పీఈటి పోస్టుల మంజూరీ కొరకు రాష్ట్రములోని ప్రాథమిక పాఠశాలల్లోని ఎస్జీటీ పోస్టులను రద్దు చేసే ప్రతిపాదనను వెంటనే విరమించుకోవాలని
తపస్ రాష్ట్ర అదనపు కార్యదర్శి వి.వెంకటరమణా రావు అన్నారు. ప్రభుత్వాధికారులు ప్రాథమిక పాఠశాలలను బలోపేతం చేయడం ద్వారా ప్రభుత్వ విద్యారంగాన్ని కాపాడాల్సింది పోయి, ప్రాథమిక పాఠశాలల్లో ఎస్ జి టి ఉపాధ్యాయ పోస్టులను రద్దుచేసి, పాఠశాలల మనుగడను ప్రశ్నార్థకం చేస్తున్నారని అన్నారు. ఉన్నత పాఠశాలలకు అవసరమయ్యే పోస్టులను కొత్తగా క్రియేట్ చేయడం ద్వారా మంజూరు చేయాలని, ఎస్జీటీ పోస్టులను ప్రతి ప్రాథమిక పాఠశాలలో తరగతికి ఒక ఉపాధ్యాయుడు ఉండే విధంగా చూడాలని, అప్పుడే ప్రభుత్వ విద్యారంగం పైన ప్రజలకు నమ్మకం కలిగి మరింత మెరుగైనటువంటి బోధన కల్పించడం కొరకు ఉపాధ్యాయులకు వెసులుబాటు కల్పించాలని ప్రభుత్వాన్ని కోరారు.

## ఈవోగా బాధ్యతలు తీసుకున్న రవిచంద్ర



**టిమీడియా, ఫిబ్రవరి 6 ,తిరుమల :** తిరుమల, తిరుపతి దేవస్థానం నూతన ఈవోగాముద్దాడ రవిచంద్ర బాధ్యతలు స్వీకరించారు. శుక్రవారం తిరుమలలో శ్రీవారిని దర్శించుకున్న సందర్భంగా రంగనాయకుల మండపంలో రవిచంద్ర పండితులు ఆశీర్వచనం అందజేశారు. అదనపు ఈవో వెంకయ్య చౌదరి స్వామివారి తీర్థప్రసాదాలను అందజేశారు. టీటీడీలో పనిచేస్తున్న సీనియర్ అధికారులు, అర్చకులు, భక్తుల సలహాలతో ఆలయాన్ని మరింత అభివృద్ధి చేస్తానని, భక్తుల మనోభావాలు దెబ్బతినకుండా పని చేస్తానని తెలిపారు.

**కొనసాగుతున్న భక్తుల రద్దీ :** తిరుమలలో భక్తుల రద్దీ కొనసాగుతుంది. నిన్న స్వామివారిని 61,655 మంది భక్తులు దర్శించుకోగా 21,003 మంది తలనీలాలు సమర్పించుకున్నారు. భక్తులు సమర్పించుకున్న కానుకల ద్వారా హుండీకి రూ. 3.89 కోట్లు ఆదాయం వచ్చిందన్నారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులతో 26 కంపార్టుమెంట్లు నిండిపోయాయి. టోకెన్లు లేని భక్తులకు 12 గంటల్లో సర్వదర్శనం అవుతుందని వివరించారు.

## అగ్రికల్చర్ క్లస్టర్ ఏర్పాటు చేయాలని వినతి



**టిమీడియా, ఫిబ్రవరి 6 ,సారంగాపూర్ :** సారంగాపూర్ మండలంలోని అతిపెద్ద గ్రామమైన ఉమ్మడి రేచపల్లి గ్రామంలో అగ్రికల్చర్ క్లస్టర్ ఏర్పాటు చేయాలని కోరుతూ శుక్రవారం గ్రామ సర్పంచ్ బాస మహేష్ జిల్లా వ్యవసాయ శాఖ కార్యాలయంలో వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా మహేష్ మాట్లాడుతూ సారంగాపూర్ మండలంలోని రేచపల్లి ఉమ్మడి గ్రామంలో రేచపల్లి, లచ్చునాయక్ తండా, భీంరెడ్డి గూడెం, లచ్చునాయక్ తండాలుగా నాలుగు గ్రామాలు ఏర్పాటయ్యాయని వీటిలో 10వేల మందికి పైగా జనాభా ఉందని, 5వేల ఎకరాలకు మించి వ్యవసాయ సాగుభూములు ఉన్నాయని తెలిపారు. గ్రామంలో కనీస వ్యవసాయ మౌళిక సదుపాయాలు లేక రైతులు ఇబ్బందులు పడుతున్నారని రైతులకు అవసరమైన యంత్రాలు, పనిముట్ల, ఎరువులు, శిక్షణ, వ్యవసాయ సంబంధిత పరికరాలు అందుబాటులో ఉండేలా గ్రామంలో అగ్రికల్చర్ క్లస్టర్ ఏర్పాటు చేయాలని కోరినట్లు పేర్కొన్నారు. రైతుల అవసరాలను పరిగణలోకి తీసుకుని గ్రామంలో క్లస్టర్ ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని జిల్లా అధికారిని కోరారు.

## ఉత్కంఠ రేపుతున్న మెతుకుసీమ


మాజీ సీఎం కేసీఆర్ మార్గదర్శనంలో పురఎన్నికల్లో పట్టు నిలుపుకునేందుకు హరీశ్‌రావు శ్రమిస్తున్నారు. మెదక్ ఎంపీ రఘునందన్‌రావు, ఎమ్మెల్సీ అంజిరెడ్డి బీజేపీ అభ్యర్థుల గెలుపు కోసం క్షేత్రస్థాయిలో పనిచేస్తున్నారు. రాష్ట్ర రాజకీయాల్లో ఉమ్మడి మెదక్ జిల్లాది కీలక పాత్ర. మాజీ సీఎం కేసీఆర్, మాజీ మంత్రి హరీశ్‌రావు, ప్రస్తుత మంత్రి దామోదర రాజనర్సింహ, బీజేపీ ఎంపీ రఘునందన్‌రావు సహా కీలక నేతలు ఇక్కడి నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్నారు. కాంగ్రెస్, బీఆర్?ఎస్, బీజేపీ మెతుకు సీమలోని పురపాలికల్లో జెండా ఎగురవేయాలనే పట్టుదలతో రంగంలోకి దిగాయి. వ్యూహ ప్రతివ్యూహాలతో పురపోరు పతాకస్థాయికి చేరింది.

**-హోరాహోరీగా**
సిద్దిపేట జిల్లా పరిధిలో దుబ్బాక, గజ్వేల్-ప్రజ్ఞాపూర్, హుస్నాబాద్, చేర్యాల మొత్తంగా నాలుగు మున్సిపాలిటీలు ఉన్నాయి. దుబ్బాక పురపాలికలో 20 వార్డులు ఉండగా 40వేల వరకు జనాభా ఉంటుంది. వ్యవసాయం, చేనేత, బీడీ పరిశ్రమపై ఆధారపడి జీవించే వాళ్లు ఎక్కువ. దుబ్బాకకు సమీపంలోనే మల్లన్నసాగర్ ప్రాజెక్టు ఉన్నప్పటికీ కాల్వల నిర్మాణం పూర్తిస్థాయిలో జరగకపోవడం వల్ల రైతులకు సాగునీటి కష్టాలు తప్పడం లేదు. దుబ్బాక మున్సిపాలిటీని కైవసం చేసుకోవాలని మూడు పార్టీలు హోరాహోరీగా తలపడుతున్నాయి. ఐతే దుబ్బాక బీఆర్?ఎస్ ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి, బీజేపీ ఎంపీ రఘునందన్‌రావు పురపోరును ప్రతిష్ఠాత్మకం తీసుకుని గెలుపు కోసం శ్రమిస్తున్నారు. మాజీ సీఎం కేసీఆర్ ప్రాతినిధ్యం వహిస్తున్న గజ్వేల్ నియోజకవర్గం పరిధిలోని గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మున్సిపాలిటీ పోరు ఆసక్తి రేపుతోంది. మల్లన్నసాగర్ ముంపు గ్రామాలైన పల్లెపహాడ్, వేములఘాట్, ఏటిగడ్డ కిష్టాపూర్, బ్రహ్మణ బంజేరుపల్లి, లక్ష్మాపూర్, ఎర్రవల్లి పంచాయతీలు.. ఈ పురపాలికలో విలీనమయ్యాయి. మాజీ మంత్రి హరీశ్‌రావు గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మున్సిపాలిటీ బాధ్యత తీసుకున్నారు. గెలుపు కోసం బీఆర్?ఎస్, కాంగ్రెస్ వ్యూహప్రతివ్యూహాలకు పదును పెడుతున్నాయి.

**- పురపాలికను చేజిక్కించుకోవాలని**
ఇక చేర్యాల మున్సిపాలిటీ విషయానికి వస్తే 2018లో ఏర్పడింది. ఇక్కడ 12 వార్డులు ఉన్నాయి. 2020లో జరిగిన ఎన్నికల్లో కాంగ్రెస్-5, బీఆర్ఎస్-5 సీట్లు, స్వతంత్రులు రెండు సీట్ల చొప్పున గెలిచారు. ఇద్దరు స్వతంత్రుల మద్దతుతో బీఆర్?ఎస్ చేర్యాల పురపీఠాన్ని దక్కించుకుంది. చేర్యాల పురపాలిక బాధ్యతలు తీసుకున్న జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి మరోసారి గులాబీ జెండా ఎగురవేయాలనే పట్టుదలతో పనిచేస్తున్నారు. అధికార కాంగ్రెస్ తరఫున భువనగిరి ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి చేర్యాల పురపాలికను చేజిక్కించుకోవాలని పావులు కదుపుతున్నారు. సంగారెడ్డి జిల్లాలో సదాశివపేట, గడ్డపోతారం, ఇస్నాపూర్, గుమ్మడిదల, జిన్నారం, ఇంద్రేశం ఇటీవల మున్సిపాలిటీలుగా అవతరించాయి. సదాశివేట మున్సిపాలిటి సంగారెడ్డి పట్టణానికి సమీపంలో ఉంది. ఇక్కడ 26 వార్డులు ఉన్నాయి. సదాశివపేట పురపాలికలో మహిళ ఓటర్లు కీలకంగా ఉన్నారు. గడ్డపోతారంలో 18వార్డులు, ఇంద్రేశంలో 18 వార్డులు, ఇస్నాపూర్ 26 వార్డులు, జిన్నారంలో 20వార్డులు, గుమ్మడిదలలో 22 వార్డులున్నాయి. పరిశ్రమలు ఎక్కువగా ఉండటం, హైదరాబాద్‌కు సమీపంలోనే ఉండటంతో ఈ మున్సిపాలిటీలు వేగంగా విస్తరిస్తున్నాయి. పరిశ్రమలకు నెలవుగా ఉన్నా మౌలిక సదుపాయాల కొరత వేధిస్తోంది. తాగునీటి సరఫరా పరిమితంగా ఉండటం, డ్రైనేజీ లేక మురుగు వీధుల్లోకి రావడం ప్రజలను ఇబ్బంది పెడుతోంది. కాలనీలు పెరుగుతున్నా పార్కులు, ఆట స్థలాలు లేవు. మున్సిపాలిటీ హోదాతో ఇంటి పన్నులు, నీటి పన్నులు, లైసెన్స్ ఫీజులు పెరిగాయని అదేస్థాయిలో అభివృద్ధి పరుగులు పెట్టాలని స్థానికులు ఆకాంక్షిస్తున్నారు. కాంగ్రెస్ సైతం సత్తా చాటాలనే : జహీరాబాద్ నియోజకవర్గంలో పరిధిలో జహీరాబాద్, కోహీర్ మున్సిపాలిటీలు ఉన్నాయి. జహీరాబాద్ పురపాలికలో 37 వార్డులు, 78 వేల 999మంది ఓటర్లున్నారు. స్థానికంగా పార్టీ ఎమ్మెల్యే మాణిక్‌రావు ఉండటంతో బీఆర్?ఎస్ దూకుడుగా ముందుకెళ్తోంది. కాంగ్రెస్ సైతం సత్తా చాటాలనే పట్టుదలతో వ్యూహాలకు పదును పెట్టింది. ఐతే వర్గపోరు అధికార పార్టీకి తలనొప్పిగా మారింది. జహీరాబాద్ నియోజకవర్గ ఇంఛార్జ్ చంద్రశేఖర్, ఎంపీ సురేష్ షెట్కర్, స్థానిక నేత గిరిధర్‌రెడ్డి మద్దతుదారులు వర్గాలుగా విడిపోయారు. మేజర్ పంచాయతీగా ఉన్న కోహీర్ కాంగ్రెస్ సర్కార్ ఇటీవల మున్సిపాలిటీగా మార్చింది. ఇక్కడ 16 వార్డులు, 10 వేల 944 మంది ఓటర్లు ఉన్నారు. కోహీర్‌లో ప్రధానంగా కాంగ్రెస్, బీఆర్ఎస్ మధ్య పోటీ ఉంది. తొలిసారి పురపీఠం దక్కించుకోవాలనే పట్టుదలతో ఇరు పార్టీలుతలపడుతున్నాయి. నారాయణఖేడ్‌లో పురపాలక సంఘం 2018లో ఏర్పాటైంది. ఏళ్ల నుంచి సమస్యలు మాత్రం పరిష్కారం కావడం లేదు. ఇరుకు రోడ్లు, ట్రాఫిక్ సమస్య పుర ప్రజల్ని వేధిస్తున్నాయి. మురుగు కాలువలు చిన్నగా ఉండటం వల్ల వర్షకాలంలో పొంగిపొర్లి స్థానికులకు నరకం కనపడుతోంది. సమస్యలకు పరిష్కారం చూపే వారినే ఆదరిస్తామని ఓటర్లు అంటున్నారు. స్థానిక ఎంపీ, ఎమ్మెల్యే ఇద్దరూ అధికార పార్టే కావడంతో నారాయణ్‌ఖేడ్‌లో గెలుపుపై కాంగ్రెస్ ధీమాతో ఉంది. సంగారెడ్డి జిల్లాలో మరో కీలకమైన మున్సిపాలిటీ ఆందోల్-జోగిపేట. ఇక్కడి నుంచే వైద్యఆరోగ్యశాఖ మంత్రిగా దామోదర రాజనరసింహ ప్రాతినిధ్యం వహిస్తున్నారు. ఆందోల్-జోగిపేట పురపాలికలో గెలుపుపై కాంగ్రెస్ ధీమాతో ఉండగా గట్టి పోటీనిచ్చేందుకు బి ఆర్ ఎస్ పావులు కదుపుతోంది. మెదక్ జిల్లా పరిధిలో మెదక్, నర్సాపూర్, తూప్రాన్, రామాయంపేట్ మున్సిపాలిటీలు ఉన్నాయి. బీఆర్ఎస్ ఎమ్మెల్యేగా సునీత లక్ష్మారెడ్డి నర్సాపూర్‌పై గులాబీ జెండా రెపరెపలాడించేందుకు శ్రమిస్తున్నారు. మెదక్, తుప్రాన్, రామాయంపేటలో సత్తా చాటాలని కాంగ్రెస్ పట్టుదలతో ఉంది. మెదక్ ఎమ్మెల్యే రోహిత్‌రావు, ఆయన తండ్రి మైనంపల్లి హనుమంతరావు వ్యూహాలకు పదును పెడుతున్నారు. మొత్తంగా ఉమ్మడి మెదక్ జిల్లాలో కాంగ్రెస్ బీఆర్ఎస్ హోరాహోరీగా తలపడుతుండగా బీజేపీ సైతం ఉనికి చాటాలనే ఉత్సాహంగా పురపోరులో కాలు దువ్వుతోంది.

## మార్చి నాటికి విజయవాడ బైపాస్ పూర్తి

**- కేంద్రమంత్రి నితిన్ గడ్కరీ వెల్లడి**



**టిమీడియా, ఫిబ్రవరి 6 , న్యూఢిల్లీ: :** నేషనల్ హైవే-16లోని విజయవాడ-గుండుగొలను సెక్షన్?లో భాగంగా చినఆవుటపల్లి-గొల్లపూడి మధ్య 30 కిలోమీటర్ల మేర తలపెట్టిన 6 లైన్ల విజయవాడ బైపాస్ రోడ్డు నిర్మాణాన్ని మార్చి 31 నాటికి పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు కేంద్ర రహదారి, రవాణాశాఖ మంత్రి నితిన్ గడ్కరీ తెలిపారు. లోక్?సభలో జనసేన ఎంపీ వల్లభనేని బాలశౌరి అడిగిన ప్రశ్నకు ఈమేరకు ఆయన సమాధానం ఇచ్చారు.

**మార్చి కల్లా పూర్తి చేయాలని లక్ష్యం**
ఆరు వరుసల విజయవాడ బైపాస్ రోడ్డు నిర్మాణాన్ని రూ. 1,148.40 కోట్ల అంచనా వ్యయంతో చేపట్టారు. ఈ రహదారి పనులను 2021 ఫిబ్రవరి 18 నుంచి మొదలు అయ్యాయని తెలిపారు. ఇప్పటి వరకు 29.57 కిలోమీటర్లు పూర్తి అయినట్లు వెల్లడించారు. మిగిలిన 0.43 కి.మీ. పనులను మార్చి 31 కల్లా పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు ఆయన తెలిపారు.

**డిస్కంల నష్టాలు రూ.29 వేల కోట్లు**
ఏపీలోని 3 డిస్కంలకు 2025 మార్చి 31 నాటికి రూ. 29,420 కోట్ల నష్టాలు ఉన్నట్లు కేంద్ర విద్యుత్తుశాఖ సహాయమంత్రి శ్రీపాద యశోనాయక్ తెలిపారు. అప్పటికి డిస్కంల అప్పులు రూ. 77,583 కోట్ల మేర ఉన్నట్లు చెప్పారు. లోక్?సభలో అడిగిన ఒక ప్రశ్నకు ఈ మేరకు ఆయన సమాధానం ఇచ్చారు. దేశవ్యాప్తంగా స్మార్ట్ మీటర్లు ఏర్పాటు : రాష్ట్రంలోని డిస్కంల సగటు సరఫరా, వాణిజ్య నష్టాలు 7.87 శాతం ఉన్నట్లు చెప్పారు. 2021 జులైలో రీవ్యాంప్డ్ డిస్ట్రిబ్యూషన్ సెక్టార్ స్కీం ని ప్రారంభించారు. దీన్ని అనుసరించి 28 రాష్ట్రాల్లోని 45 డిస్కంలకు స్మార్ట్ మీటరింగ్ పనులు మంజూరు చేసినట్లు తెలిపారు. ఈ ఏడాది జనవరి 1 నాటికి దేశ వ్యాప్తంగా 4.19 కోట్ల స్మార్ట్ మీటర్లు ఏర్పాటు చేసినట్లు చెప్పారు. ఏపీలో 56,08,846 మీటర్లకు గాను 22,88,414 మీటర్లు ఏర్పాటు చేసినట్లు ఆయన వెల్లడించారు.

**1,629 బస్సు ప్రమాదాలు**
రాష్ట్రంలో 2020-2024 మధ్య కాలంలో 1,629 బస్సు ప్రమాదాలు జరిగినట్లు కేంద్ర రహదారి, రవాణా శాఖ మంత్రి నితిన్ గడ్కరీ తెలిపారు. ప్రైవేట్ బస్సు ప్రమాదాల పై ఏలూరు లోక్‌సభ సభ్యుడు పుట్టా మహేష్‌కుమార్ అడిగిన ప్రశ్నకు ఆయన బదులు ఇచ్చారు. ఇదే సమయంలో దేశ వ్యాప్తంగా 58,987 ప్రమాదాలు జరిగినట్లు చెప్పారు. ఏపీలో గత 6 ఏళ్లలో 3,443 కిలోమీటర్ల నేషనల్ హైవేల నిర్మాణం జరిగిందని మంత్రి నితిన్ గడ్కరీ తెలిపారు. ఇదే సమయంలో రాష్ట్రంలో కొత్తగా 34 టోల్ ప్లాజాలు ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. ఇదిలా ఉండగా మరోవైపు జాతీయ రహదారి విస్తరణ మొదట ప్రతిపాదనల ప్రకారం మల్కాపురం నుంచి విజయవాడ శివారులోని గొల్లపూడి దగ్గర పశ్చిమ బైపాస్ వరకు ఇప్పుడు ఉన్న 226 కిలోమీటర్లు 4 లైన్ల నుంచి 6 లైన్లుగా విస్తరించాలి. దీనికి రూ. 8 వేల కోట్లు ఖర్చు అవుతుందని అంచనా వేసి, డీపీఆర్ సిద్ధం చేస్తున్నారు. ఈ నేపథ్యంలో గొల్లపూడి వరకు కాకుండా అమరావతి అవుటర్ రింగ్ రోడ్డు క్రాస్ అయ్యే కంచికచర్ల వరకే విస్తరించే ప్రతిపాదనను హైవే అథారిటీ అధికారులు లేవనెత్తారు. దీంతో విస్తరణ 226 కిలో మీటర్ల నుంచి 198 కి.మీ. తగ్గిపోయింది. ఈ ఆలోచనను ఎంపీ శివనాథ్ తీవ్రంగా వ్యతిరేకించి, సీఎం చంద్రబాబు దృష్టికి తీసుకెళ్లారు. సీఎం సైతం గొల్లపూడి వరకు 6 లైన్లు చేయాలని కేంద్రమంత్రికి లేఖ రాశారు. ఫలితంగా ప్రస్తుతం ఈ రహదారి విస్తరణకు సాకారమైంది.

## సుప్రీం కోర్టు కన్నా చంద్రబాబు పదవి గొప్ప కాదు : వైఎస్ జగన్



**టిమీడియా, ఫిబ్రవరి 6 , అమరావతి :** తిరుమల లడ్డూ లో జంతువుల కొవ్వు కలువలేదని సుప్రీంకోర్టు నియమించిన సీబీఐ ఇచ్చిన చార్జ్‌షీట్ నివేదికలో స్పష్టంగా పేర్కొన్నారని వైసీపీ అధినేత, మాజీ సీఎం వైఎస్ జగన్ స్పష్టం చేశారు. సుప్రీం కోర్టు కంటే చంద్రబాబు పదవి గొప్పది కాదని వ్యాఖ్యానించారు. అయితే చంద్రబాబు స్వార్థంతో వేసుకుంటున్న ఏకసభ్య కమిషన్‌తో ఎటువంటి ఫలితం ఉండదని అన్నారు. ఇటీవల టీడీపీ శ్రేణుల దాడులతో దహనానికి గురైన మాజీ మంత్రి జోగి రమేష్ ఇంటిని, సందర్శించి పరామర్శించారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ తిరుమల లడ్డూపై చంద్రబాబు ఎన్ని రకాలుగా అవాస్తవాలను ప్రచారం చేసిన చులకన కావడం ఖాయమని అన్నారు. లడ్డూలో జంతు కొవ్వు కలిసిందని బాబుకు ఎవరు చెప్పారని ప్రశ్నించారు. టీటీడీ ప్రక్షాళన కాకముందే ఈవో శ్యామలరావును ఎందుకు తొలగించారని తెలిపారు. పాపం చేసింది ఎవరో తేల్చాలని, ఆ భగవంతుడు చంద్రబాబు బుద్ధి, జ్ఞానం రావాలని కోరుకుంటున్నానని అన్నారు. జోగి రమేష్ ఇంటిపై యాసిడ్, పెట్రోల్ బాటిళ్లతో పోలీసులు, టీడీపీ గూండాలు కమ్ముక్కై విధ్వంసం చేశారని ఆరోపించారు. వైసీపీ నాయకులపై దాడులకు పాల్పడుతున్న వారిని తాము అధికారంలోకి వచ్చిన తరువాత బోన్‌లో నిలబెడుతామని , వారందరికి శిక్ష పడుతుందని తెలిపారు.




## రికవరీ ఏజెంట్ల వేధింపులకు చెక్

**-రిజర్వు బ్యాంక్.... కొత్త రూల్స్**

**టిమీడియా, ఫిబ్రవరి 6 , న్యూఢిల్లీ:** బ్యాంకులు, ఇతర ఆర్థిక సంస్థల నుంచి లోన్స్ తీసుకున్న వారికి వేధింపుల నుంచి విముక్తి కల్పిస్తూ రిజర్వ్ బ్యాంక్ సంచలన నిర్ణయం తీసుకుంది. లోన్ రికవరీ ఏజెంట్ల అరాచకాలకు అడ్డుకట్ట వేయడమే లక్ష్యంగా కొత్త రూల్స్ తీసుకొస్తున్నట్లు ఆర్‌బీఐ గవర్నర్ సంజయ్ మల్హోత్రా ప్రకటించారు. దేశవ్యాప్తంగా బ్యాంకులు, ఆర్థిక సంస్థల రికవరీ ఏజెంట్లు అనుసరిస్తున్న దురుసు ప్రవర్తన, బెదిరింపులు, బలవంతపు వసూళ్లపై ఫిర్యాదులు పెరుగుతున్న వేళ.. వినియోగదారుల రక్షణే ధ్యేయంగా కేంద్ర బ్యాంక్ ఈ కఠిన చర్యలకు శ్రీకారం చుట్టింది. ముఖ్యంగా నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించే ఏజెంట్ల తీరుపై బ్యాంకులను నేరుగా బాధ్యులను చేస్తూ కొత్త డ్రాఫ్ట్ గైడ్‌లైన్స్‌ను రూపొందించనున్నారు. ఈ కొత్త సంస్కరణల్లో భాగంగా మూడు కీలకమైన మార్గదర్శకాలను ఆర్‌బీఐ విడుదల చేయనుంది. మొదటిది ఆర్థిక ఉత్పత్తుల మిస్ సెల్లింగ్ అరికట్టడం.. రెండోది లోన్ రికవరీ ఏజెంట్ల నియామకం వారి పనితీరును నియంత్రించడం. ఇక మూడోది అనధికారిక ఎలక్ట్రానిక్ లావాదేవీల వల్ల కస్టమర్లకు కలిగే నష్టాన్ని పరిమితం చేయడం. వీటితో పాటు డిజిటల్ మోసాలకు గురయ్యే సామాన్యులకు భరోసా ఇస్తూ.. చిన్న విలువ కలిగిన మోసపూరిత లావాదేవీల్లో నష్టపోయిన కస్టమర్లకు రూ. 25వేల వరకు పరిహారం అందించే సరికొత్త విధానాన్ని కూడా ఆర్‌బీఐ ప్రతిపాదించింది. ఇది డిజిటల్ బ్యాంకింగ్ వినియోగదారులకు ముఖ్యంగా సాంకేతికతపై పెద్దగా అవగాహన లేని వారికి కొండంత అండగా నిలవనుందిప్రస్తుతం ఉన్న రూల్స్ ప్రకారం కూడా రికవరీ ఏజెంట్లు ఉదయం 8 గంటల నుండి రాత్రి 7 గంటల మధ్య మాత్రమే కస్టమర్లకు ఫోన్ చేయటం లేదా వారిని కలవటానికి అనుమతి ఉంది. శారీరక హింస, అసభ్య పదజాలం వాడటం, ఇరుగుపొరుగు వారికి లేదా బంధువులకు లోన్ వివరాలు వెల్లడించడం వంటివి పూర్తిగా నిషేధం. అయినప్పటికీ గ్రౌండ్ లెవల్లో ఈ రూల్స్ అమలు కాకపోవడంతో ఆర్‌బీఐ ఇప్పుడు పర్యవేక్షణను మరింత కఠినతరం చేస్తోంది.

ఇకపై రికవరీ ఏజెంట్ల ప్రవర్తనలో ఎలాంటి లోపాలున్నా అది సదరు బ్యాంక్ వైఫల్యంగానే పరిగణించబడుతుంది. దీనివల్ల బ్యాంకులు తమ ఏజెంట్లపై మరింత పటిష్టమైన నియంత్రణను కలిగి ఉండాల్సిన అవసరం ఏర్పడుతుంది. అంతేకాకుండా సీనియర్ సిటిజన్లు వంటి సున్నితమైన వినియోగదారుల కోసం డిజిటల్ చెల్లింపుల భద్రతను మెరుగుపరచడానికి ఎక్స్‌ట్రా అథెంటికేషన్.. క్రెడిట్ ఆలస్యం వంటి అంశాలపై ఆర్‌బీఐ ఒక చర్చా పత్రాన్ని కూడా విడుదల చేయనుంది. లోన్ తీసుకున్న వ్యక్తిని గౌరవప్రదంగా చూడాలని, అక్రమ పద్ధతుల్లో వసూళ్లకు పాల్పడితే ఉపేక్షించేది లేదని ఆర్‌బీఐ స్పష్టం చేస్తోంది. ఈ నిర్ణయం వల్ల లోన్ తీసుకున్న లక్షలాది మంది సామాన్యులకు మానసిక ఒత్తిడి నుంచి ఉపశమనం కలగడమే కాకుండా.. బ్యాంకింగ్ వ్యవస్థపై నమ్మకం పెరిగే అవకాశం ఉంది.